అనకాపల్లి మార్కెట్ కమిటీలో ఉద్యోగుల కొరత

- 34 మందికి నలుగురే రెగ్యులర్ ఉద్యోగులు
- భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నవారిపై అదనపు పనిభారం

· 7లో

సాహితీ ఫార్మా ప్రమాదంపై

గూడుపుఠాణి

పది నెలలైనా అందని నివేదిక

- ప్రమాదంలో ఆరుగురి మృతి
- మనిషికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వకుండా నాటకం
- రూ.9 లక్షలు ఇస్తామంటున్న యాజమాన్యం
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన ప్రజా శాస్త్రవేత్తల బృందం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని సాహితీ ఫార్మా కంపెనీలో పది నెలల క్రితం సంభవించిన ప్రమాదంపై గూడుపుఠాణి నడుస్తోంది. ఇన్నాళ్లయినా వాస్తవాలు వెలుగు చూడలేదు. గత ఏడాది జూన్‌లో సదరు కంపెనీలో రీబాయిలర్ పేలి పది రోజుల వ్యవధిలో ఆరుగురు కార్మికులు చనిపోయారు. ఫార్మా ప్రమాదాల్లో చనిపోతే రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నారు. కానీ ఈ కంపెనీలో అలా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఒక్కో కార్మికుడికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించింది. ఆ తరువాత లోపాయికారీగా ఆ కంపెనీ ద్వారానే ఆ సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు చేసింది. కానీ కంపెనీ యాజమాన్యం...తాము చాలా నష్టపోయామని, ఎక్కువ మొత్తం ఇవ్వలేమంటూ కార్మిక సంఘాలను మచ్చిక చేసుకొని, మృతుల కుటుంబాలకు రూ.9 లక్షలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందాలు చేసుకుంది. దీనిపై ప్రజా శాస్త్రవేత్తల బృందం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఫార్మా కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని తీసుకోవడం లేదని, అన్‌స్కిల్డ్ కార్మికులను పెట్టుకొని నిర్వహించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పిటిషన్ వేసింది. ప్రమాదం జరిగినప్పుడు వారికి సరైన పరిహారం కూడా ఇవ్వడం లేదని వాదించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులతో ఒక కమిటీని వేసినా ఇప్పటివరకు ఆ కమిటీ ప్రమాదానికి కారణాలు వెల్లడించలేదని, ఇది చాలా అన్యాయమని శాస్త్రవేత్త బాబూరావు ... మిగతా 8వ పేజీలో

బాలికలదే పైచేయి

బాలుర కంటే ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 22, సెకండ్ ఇయర్‌లో 17 శాతం అధికం

- ప్రథమ సంవత్సరంలో 52 శాతం మంది ఉత్తీర్ణత
- బాలురు 39, బాలికలు 61 శాతం
- ద్వితీయ సంవత్సరంలో 66 శాతం మంది ఉత్తీర్ణత
- బాలురు 56, బాలికలు 73 శాతం
- కేజీబీవీల్లో ఫలితాలు భేష్



అనకాపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. శుక్రవారం ప్రకటించిన ఇంటర్మీడియల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను పరిశీలిస్తే ఈ ఏడాది జిల్లాలో బాలికలే పైచేయిగా నిలిచారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 10,443 మంది హాజరుకాగా 5,442 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 52గా నమోదైంది. ఇందులో బాలురు 4,381 మంది హాజరు కాగా 1,729 మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే 39 శాతం, అలాగే బాలికలు 6,062 మంది పరీక్షలు రాయగా 3,713 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరి ఉత్తీర్ణత శాతం 61గా నమోదైంది. జిల్లాలో మొత్తంగా ప్రథమ సంవత్సరం ఫలితాలు 52 శాతంగా నమోదయ్యాయి. బాలుర కంటే బాలికలే పైచేయిగా నిలిచారు.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

జిల్లాలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9,248 మంది పరీక్షలు రాయగా వారిలో 6,119 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 3,756 మంది పరీక్షలు రాయగా 2,112 మంది ఉత్తీర్ణత సాధించారు. 56 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 5,492 మంది పరీక్షలకు హాజరుకాగా 4,007 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 73 గా నమోదైంది. జిల్లాలో ద్వితీయ ఇంటర్ ఫలితాలు మొత్తం 66 శాతంగా నమోదైంది. మొత్తంగా చూసుకుంటే ద్వితీయ సంవత్సర ఫలితాల్లోనూ బాలికలే అధికంగా ఉత్తీర్ణులయ్యారు.



పంచదార్ల మహాలక్ష్మి (466/470) ఎంపీసీ మొదటి సంవత్సరం, తుమ్మపాల, అనకాపల్లి



బి.సాయిలక్ష్మిదీప్తి (465/470), ఎంపీసీ మొదటి సంవత్సరం, నర్సీపట్నం



కె.దిలీప్‌కుమార్ (989/1000), ఎంపీసీ ద్వితీయ సంవత్సరం బంగారయ్యపేట, కశింకోట

ఒకేషనల్ కోర్సుల ఫలితాలు

జిల్లాలో ఈ ఏడాది ఒకేషనల్ ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులు 2,353 మంది పరీక్షలకు హాజరు కాగా 1,483 మంది ఉత్తీర్ణతతో 63 శాతం నమోదైంది. ఇందులో 763 మంది బాలురు పరీక్షలు రాయగా 358 మంది ఉత్తీర్ణతతో 47 శాతం నమోదైంది. బాలికలు 1,590 మంది పరీక్షలు రాయగా, 1,129 మంది ఉత్తీర్ణతతో 71 శాతం నమోదైంది. అలాగే ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2,100 మంది పరీక్షలు రాయగా 1,483 మంది ఉత్తీర్ణతతో 71 శాతం నమోదైంది. ఇందులో 671 మంది బాలురు పరీక్షలు రాయగా 341 మంది ఉత్తీర్ణతతో 51 శాతం నమోదైంది. బాలికలు 1,429 మంది పరీక్షలు రాయగా 1,142 మంది ఉత్తీర్ణతతో 80 శాతం నమోదైంది. జిల్లాలో ద్వితీయ సంవత్సర ఒకేషనల్ కోర్సుల్లో మొత్తంగా 71 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సరస్వతీ పుత్రికలు



విద్యార్థి పేరు : బీఎస్ సాత్విక
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 989/1000
తల్లిదండ్రులు : బీవై పాత్రుడు, ధనలక్ష్మి (తండ్రి ఉపాధ్యాయుడు, తల్లి గృహిణి)
ఊరు: నర్సీపట్నం
లక్ష్యం : ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి బీటెక్ చేసి సైంటిస్టు అవుతా..



విద్యార్థి పేరు : బి.లక్ష్మీదుర్గా
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 987/1000
తల్లిదండ్రులు : బి.నూకరాజు, కుమారి (వ్యవసాయ కూలీలు)
ఊరు: నర్సీపట్నం మండలం ఎకరన్నపాలెం గ్రామం
లక్ష్యం : బీటెక్ చేసి సివిల్స్ సాధించాలని లక్ష్యం

గత ఏడాదితో పోలిస్తే కాస్త మెరుగు

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఈ ఏడాది కాస్త మెరుగ్గానే ఉన్నాయి. గత ఏడాది జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 2,501 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో కేవలం 644 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం 25.75 శాతం నమోదైంది. ఈ ఏడాది ప్రథమ సంవత్సర ఫలితాలు 52 శాతానికి పెరిగింది. అదేవిధంగా గత ఏడాది జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,125 మంది హాజరుకగా 1,132 మంది ఉత్తీర్ణులయ్యారు. 36.22 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది 66 శాతానికి పెరిగింది.

కేజీబీవీల్లో ఆశాజనకంగా ఫలితాలు

జిల్లాలో 20 కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలు ఉన్నాయి. ఆయా విద్యాలయాల నుంచి ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 619 మంది బాలికలు హాజరు కాగా, వారిలో 452 మంది ... మిగతా 8వ పేజీలో

సారా ఏరులు

పెదబొడ్డేపల్లి, పెదపేటలో అధికంగా తయారీ

- గత మూడు నెలల్లో 77 మంది అరెస్టు
- వేల లీటర్లు బెల్లం పులుసు ధ్వంసం
- ఎన్నికల నేపథ్యంలో దాడులు ముమ్మరం

నర్సీపట్నం, ఏప్రిల్ 12:

గ్రామాల్లో నాటు సారా ఏరులై పారుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు గ్రామాల్లో సారా తయారీదారులు లక్షల లీటర్లు బెల్లం పులుసు కవర్లలో ప్యాక్ చేసి భూమిలో పాతిపెట్టి దాస్తున్నారు. గట్టు చప్పుడు కాకుండా నాటు సారా సిద్ధం చేసి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నారు.



సారా బట్టీ స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లి, రోలుగుంట మండలం పెదపేట, కొంతలం గ్రామాలు నాటు సారాకి అడ్డాగా మారాయి. మారుమూల ప్రాంతాలలో బట్టీలు ఏర్పాటు చేసుకొని సారా తయారు చేసి చుట్టు పక్కల ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత మూడు నెలలుగా సారా తయారీదారులపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. నర్సీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం పరిధిలోని నర్సీపట్నం, మాకవరపాలెం, రోలుగుంట కోటవురట్ల మండలాలలో 107 మందిని బైండోవర్ చేశారు.

మూడు కేటగిరీలుగా నిఘా

నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలు చేసే వారిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిఘా పెంచారు. ఎ- కేటగిరీలోకి గ్రామంలో సారా తయారు చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు వస్తారు. బి-కేటగిరీలోకి గ్రామంలో తయారు చేసిన నాటు సారాను చుట్టు పక్కల గ్రామాలకు తీసుకు వెళ్లి విక్రయించేవారు వస్తారు. కేవలం సారా అమ్మకాలు మాత్రమే చేసేవారు సి- కేటగిరీలోకి వస్తారు. కాగా ఎన్నికల నోటిఫికేషన్‌కి రెండు నెలల ముందు నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు ముమ్మరం చేసి భారీగా నాటు సారా సీజ్ చేసి, బెల్లం పులుసు ధ్వంసం చేశారు. జనవరి నెలలో 48 నాటు సారా కేసులు నమోదు చేసి 29 మందిని అరెస్టు చేశారు. 48 లీటర్లు నాటు సారా సీజ్ చేసి 9100 బెల్లం పులుసు ధ్వంసం చేశారు. ఫిబ్రవరిలో 55 కేసులు నమోదు చేసి 25 మందిని అరెస్టు చేశారు. 22 లీటర్లు నాటు సారా సీజ్ చేసి 19,030 లీటర్లు బెల్లం పులుసు ధ్వసం చేశారు. మార్చి నెలలో 60 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్టు చేసి 106.75 లీటర్లు సారా సీజ్ చేశారు. 31,800 లీటర్లు బెల్లం పులుసు ధ్వంసం చేశారు.

గ్రామాల్లో ఆపరేషన్ పరివర్తన

సారా తయారీదారులను గుర్తించి ఆపరేషన్ పరివర్తన పథకంలో వారికి స్వయం ఉపాధి చూపిస్తున్నారు. నర్సీపట్నం సెబ్ స్టేషన్ పరిధిలో రోలుగుంట మండలం కొంతలం, పెదపేట గ్రామాలలో 80 మందికి రూ.50వేలు చొప్పున రుణాలు మంజూరు చేశారు. చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని ఉపాధి పొందుతున్నారని అధికారులు చెప్పారు. నర్సీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, రవాణా, విక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇప్పుడే గుర్తుకొచ్చెనా..

రహదారులు అధ్వానంగా ఉన్నా ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

- ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావిడిగా కొన్ని చోట్ల రహదారి పనులు
- ఇదంతా ఎన్నికల స్టంట్ అంటున్న జనం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నా ఐదేళ్లుగా పట్టించుకోలేదు. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా పాలకుల్లో చలనం లేదు. అయితే ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసీపీ ప్రభుత్వానికి ఒక్కసారిగా రహదారుల దుస్థితి గుర్తుకు వచ్చింది. రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఆగమేఘాల మీద పలు రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇదంతా ఎన్నికల స్టంట్ అని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



అనకాపల్లి నుంచి వయా మునగపాక, అచ్యుతాపురం రోడ్డు పనులు

రహదారుల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్న విమర్శలున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ప్రధాన రహదారుల నిర్మాణ పనులపై దృష్టి పెట్టలేదు. దీంతో ఐదేళ్లుగా వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో బూడి ముత్యాలనాయుడు ఉప ముఖ్యమంత్రిగా, గుడివాడ అమర్‌నాథ్ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రిగా, కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్‌గా కీలక పదవుల్లో ఉన్నా కనీసం రహదారుల గురించి పట్టించుకోలేదని జిల్లా వాసులు విమర్శిస్తున్నారు. జిల్లాలో పెందుర్తి, అనకాపల్లి, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలను కలిపే బీఎన్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గోతులతో అధ్వానంగా ఉన్న బీఎన్ రోడ్డు గురించి ఎక్కడ లేని శ్రద్ధ వైసీపీ నాయకులకు వచ్చింది. ఓట్లు అడగడానికి వెళితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో ఆగమేఘాల మీద చోడవరం పట్టణ మెయిన్ రోడ్డు పనులు ప్రారంభించారు. చోడవరం వయా వడ్డాది మెయిన్ రోడ్డుతో పాటు మండలంలోని తిమ్మానపాలెం రోడ్డు, జన్నవరం నుంచి బెన్నవోలు మీదుగా బుచ్చెయ్యపేట వరకు వెళ్లే రోడ్డు పనులు ... మిగతా 8వ పేజీలో



హడావిడిగా వేస్తున్న చోడవరం మెయిన్ రోడ్డు

కాలేజ్ బస్సు బీభత్సం



ద్విచక్ర వాహనాలు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకువెళ్లిన బస్సు

కశింకోట, ఏప్రిల్ 12:

కశింకోట మండలం బయ్యవరం వద్ద శుక్రవారం అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బీభత్సం సృష్టించింది. అతివేగంగా మూడు ద్విచక్ర వాహనాలు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

ద్విచక్ర వాహనాలు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోయిన వైనం

- బాలుడు మృతి, పది మందికి గాయాలు
- పోలీసుల అదుపులో బస్సు డ్రైవర్



మృతుడు గౌస్ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి నుంచి మాకవరపాలెం వెళుతున్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం 9.15 గంటల సమయంలో బయ్యవరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల హెరిటేజ్ పాల ఉత్పత్తుల తయారీ కేంద్రం వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పింది. రోడ్డుకు ఎడమ వైపు నిలిపి ఉన్న మూడు బైకులను, ఆపై ఒక కారును ఢీకొంది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి పిఠాపురం దర్గాకు కారులో వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అల్పాహారం తీసుకునేందుకు బయ్యవరంలో ... మిగతా 8వ పేజీలో

విశాఖ- కొల్లాం ప్రత్యేక వారాంతపు రైలు

దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు · 7లో

క్రైం... crime news

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కంచుమర్తి సూర్యనారాయణ మూర్తి (ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో ఎస్‌బీఐ వద్ద గురువారం ఉదయం బైక్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన కంచుమర్తి సూర్యనారాయణమూర్తి (60) తాపీమేస్త్రీ. అతను గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో మూడు రోడ్లు కూడలి నుంచి అనకాపల్లి రోడ్డులో గల ఎస్‌బీఐ వద్దకు స్కూటీపై వెళ్లి తిరిగి వెనక్కి వస్తుండగా బైక్ ఢీకొనడంతో గాయపడ్డారు. గాయపడిన అతడిని బంధువులు, కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రెండు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు

- జన్నవరం కొత్తూరులో 12 పశువుల పాకలు, వరికుప్పలు దగ్ధం
- 30 మేకలు, కోళ్లు మృతి
- రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమంటున్న అధికారులు
- జి.జగన్నాథపురంలో ఆరు వరి కుప్పలు ఆహుతి


జన్నవరం కొత్తూరులో కాలిపోతున్న వరికుప్పలు

చోడవరం, ఏప్రిల్ 12: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.32 లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించింది. జన్నవరం కొత్తూరు గ్రామంలో మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో 12మంది రైతులకు చెందిన పశువుల పాకలు, వరి కుప్పలతో పాటు, 30మేకలు, కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. తుల్లు సిమ్మన్న అనే రైతు పాక వద్ద తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో గాలులు వీచడంతో మంటలు ఆ పక్కనే ఉన్న ఇతర పశువుల పాకలు ఒకదాని తరువాత ఒకటిగా అంటుకున్నాయి. గ్రామస్థులు అప్రమత్తమై ఇతర పాకలకు మంటలు పాకకుండా ఆర్పివేశారు. ఈలోగా సమాచారం అందుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు ఆధ్వర్యంలో రెండు వాహనాలతో సిబ్బంది అక్కడి చేరుకుని మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో తుల్లు సిమ్మన్న, అక్కమ్మ, ఈశ్వరరావు, చంటిబాబు, పెద అప్పారావు, దేముడు, సురేష్, చిన అప్పారావు, చిట్టిబాబు, బాబూరావు, రాజు, వెంకయ్యమ్మలకు చెందిన పశువుల పాకలతో పాటు, పాకల్లో ఉన్న 20 పెద్ద మేకలు, 10 మేక పిల్లలు, 50 కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. పండించిన వరి కుప్పలు కూడా పాకల్లోనే ఉండడంతో అవి కూడా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం 20లక్షలుగా అధికారుల అంచనాల వేసినప్పటికీ, రూ.30 లక్షలకు పైబడి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. బాధితులను విప్ ధర్మశ్రీతో పాటు టీడీపీకి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీ శంకర్ తదితరులు వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. ఇదిలావుంటే, జి.జగన్నాథపురంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మరో అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఆరుగురు రైతుల వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందని అంచనా. ఈ సమాచారం తెలుసుకున్న చోడవరం అగ్నిమాపక శాఖ అధికారి జీవీ రామస్వామి, లీడింగ్ ఫైర్‌మేన్ కె.రాము, సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు.

12 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: పట్టణంలో శుక్రవారం ఒక వ్యక్తి నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన మోదినాయుడు మద్యంతో పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

జాలర్ల వలలో భారీ తిమింగలం



అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని తంతడి-ఒడపాలెం సముద్ర తీరం నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలో భారీ చేప పడింది. దీనిని వారు ఒడ్డు వరకూ లాగారు. తీరా ఒడ్డుకు చేరాక పరిశీలిస్తే.. అది తిమింగలంగా గుర్తించారు. ఈ భారీ తిమింగలంగా గుర్తించారు. ఇది సుమారు 30 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు ఉందని మత్స్యకారులు తెలిపారు. ఈ తిమింగలం కదలకపోవడంతో మత్స్యకారులు తమ వలలను తొలగించి సముద్రంలోకి పంపించే ప్రయత్నాలు చేసినప్పటికీ వెళ్లలేదు. చనిపోయిన తిమింగలం వలలో పడిందని జాలర్లు తెలిపారు.

విశాఖ-కొల్లాం ప్రత్యేక వారాంతపు రైలు

- దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 12: వేసవి రద్దీని దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక వారాంతపు రైలుతోపాటు వయా విశాఖ, దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08539 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూలై 3వతేదీ వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి ఈనెల 18 నుంచి జూలై 4వతేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.35 గంటలకు కొల్లాంలో బయలుదేరి మర్నాడు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు-న్యూ టిన్సుకియా వయా విశాఖ

05952 నంబరు గల రైలు మే రెండు జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, మర్నాడు (మూడోరోజు) ఉదయం 9.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి మే ఆరు నుంచి జూలై ఒకటో తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 00.30 (ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు) ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

భువనేశ్వర్-యలహంక-భువనేశ్వర్ వయా దువ్వాడ

02811 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 5.00 గంటలకు మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో కుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల, ధోనే, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

హౌరా-యశ్వంతపూర్-హౌరా వయా దువ్వాడ

02863 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 (తెల్లవారితే శనివారం) గంటలకు యశ్వంతపూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు (ఆదివారం) మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

ఇంటర్‌లో అదరగొట్టారు

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉమ్మడి అనకాపల్లి జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించి అదరహో అనిపించారు. వారిలో పలువురు విద్యార్థులను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా తమ భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు.

ప్రథమ సంవత్సరం

డాక్టర్ అవుతా...



పేరు: డీవీఎస్. సాయి నిహారిక
మార్కులు: 470/464,
గ్రూపు : ఎంపీసీ
ఊరు : తుని
కళాశాల : శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, పాయకరావుపేట
తండ్రి పేరు : డీ.సత్యనారాయణమూర్తి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి పేరు : వెంకట సీత సత్యవతి, గృహిణి
లక్ష్యం : ఐఐటీలో బీ.టెక్ ఇంజనీరింగ్ చదువుతాను. భవిష్యత్‌లో ఇంజనీరుగా ఉన్నత స్థానాన్ని సాధించాలనుకుంటున్నాను.

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : యు.ప్రణతి
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ మొదటి సంవత్సరం 434/440
తల్లిదండ్రులు : యు.ప్రసాద్, స్వరూపారాణి (తండ్రి చర్చి పాస్టర్, తల్లి గృహిణి)
లక్ష్యం : మెడిసిన్ చేయాలని లక్ష్యం

ఐఐటీ పూర్తి చేయడమే లక్ష్యం



పేరు : మాదేటి దివ్య సంస్కృతి
మార్కులు : 470/461
గ్రూపు: ఎంపీసీ, మొదటి సంవత్సరం
ఊరు : తుమ్మపాల, అనకాపల్లి మండలం
కళాశాల : సుభిక్ష కాలేజి, కూర్మన్నపాలెం
తండ్రి : మాదేటి రామచంద్రమూర్తి, వ్యాపారి
తల్లి : నాగలక్ష్మి, గృహిణి
లక్ష్యం : ఐఐటీ పూర్తి చేయడమే లక్ష్యం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



పేరు : పి.సుప్రియ
గ్రూపు : ఎంపీసీ
మార్కులు : 465/470
ఊరు : కోనేపాలెం, అచ్యుతాపురం మండలం
కాలేజీ : క్రైట్స్ జూనియర్ కాలేజీ
తండ్రి : పి.శ్రీను (లారీ డ్రైవర్)
తల్లి : అపర్ణ (టైలరింగ్)
లక్ష్యం : సాఫ్‌వేర్ ఇంజనీర్

ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

విద్యార్థి పేరు : బి. సాయిలక్ష్మిదీప్తి
కళాశాల : శ్రీప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 465/470
తల్లిదండ్రులు : బి. రమేశ్‌కుమార్, రామలక్ష్మి (తండ్రి ఆర్టీసీ డ్రైవర్, తల్లి గృహిణి)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : కె.దుర్గాగాయత్రి
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 464/470
తల్లిదండ్రులు : కె.లోవరాజు, సుజాత (వ్యవసాయం)
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

సివిల్స్ సాధించడం లక్ష్యం

పేరు : పంచదార్ల మహాలక్ష్మి
మార్కులు : 470/466
గ్రూపు: ఎంపీసీ, మొదటి సంవత్సరం
ఊరు : తుమ్మపాల, అనకాపల్లి మండలం
కళాశాల : నారాయణ కాలేజి, బోయపాలెం
తండ్రి : పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ, తుమ్మపాల
తల్లి : పంచదార్ల వెంకటలక్ష్మి, గృహిణి
లక్ష్యం : సివిల్స్ సాధించడం లక్ష్యం

ద్వితీయ సంవత్సరం

మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలి



పేరు : టి.వెన్నెల
మార్కులు : 1000/982,
గ్రూపు : ఎంపీసీ **ఊరు :** తుని
కళాశాల : శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, పాయకరావుపేట
తండ్రి పేరు : టి.గోపాలకృష్ణ, ఎల్ఐసీ.ఏజెంటు
తల్లి పేరు : జయలక్ష్మి, గృహిణి
లక్ష్యం : ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించి ఇంజనీరింగ్ చదువుతాను. భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలను కుంటున్నాను.

మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలి



విద్యార్థి పేరు : కె.జ్యోతి ఐశ్వర్యలక్ష్మి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 986/1000
తల్లిదండ్రులు : కె.జగదీశ్, సౌమ్య (తండ్రి వ్యాపారి, తల్లి గృహిణి)
లక్ష్యం : లాయర్ అవ్వాలని లక్ష్యం

బిఫార్మసీ లక్ష్యం



విద్యార్థి పేరు : కె.శ్రావణి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ 986/1000
తల్లిదండ్రులు : కె. కళ్యాణం, రాజేశ్వరి (తండ్రి సేల్స్‌మేన్, తల్లి గృహిణి)
లక్ష్యం : బిఫార్మసీ లక్ష్యం

సివిల్స్‌కు వెళ్లాలనే కోరిక

పేరు : కె. దిలీప్‌కుమార్
మార్కులు : 1000/989
గ్రూపు: ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం
ఊరు : బంగారయ్యపేట, కశింకోట మండలం
కళాశాల : హిమశేఖర్ జూనియర్ కళాశాల
తండ్రి : కె. గణపతిరావు, ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో ఆపరేషన్ మేనేజర్
తల్లి : హిమబిందు, గృహిణి
లక్ష్యం : ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించాలని ఉంది. అలాగే సివిల్స్‌కు వెళ్లాలనే కోరిక ఉంది

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : సీహెచ్.కోటి లోక్ తేజ
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు: ఎంపీసీ 989/1000
తల్లిదండ్రులు : సీహెచ్ వెంకటరమణ, సూర్యకుమారి (తండ్రి ఎల్ఐసీ ఏజెంట్, తల్లి గృహిణి)
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : ఎం.నవ్య
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 983/1000
తల్లిదండ్రులు : ఎం.వీర్రాజు, భవాణి (తండ్రి రైతు, తల్లి టైలరింగ్)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

ప్రథమ సంవత్సరం

ఇంజనీర్ అవుతా..

విద్యార్థి పేరు : కె. త్రిపురాదేవి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 463/470
తల్లిదండ్రులు : కె. నూకరాజు, మహాలక్ష్మి (తండ్రి రైతు, తల్లి గృహిణి)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : కె.యమున
కళాశాల : శ్రీ విద్య జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ 433/440
తల్లిదండ్రులు : కె.శ్రీనివాస్, దుర్గ (తండ్రి కూలి, తల్లి గృహిణి)
లక్ష్యం : మెడిసిన్ చేయాలని లక్ష్యం

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : ఎస్ ప్రేమవర్షిత
కళాశాల : శ్రీ విద్య జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 460/470
తల్లిదండ్రులు : ఎస్ ప్రసాద్, ధనలక్ష్మి (ఉపాధ్యాయులు)
లక్ష్యం : ఐఐటీలో ర్యాంక్ సాధించాలని లక్ష్యం

అనకాపల్లి మార్కెట్ కమిటీలో ఉద్యోగుల కొరత

- 34 మందికి నలుగురే రెగ్యులర్ ఉద్యోగులు
- భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నవారిపై అదనపు పనిభారం



మార్కెట్ కమిటీ కార్యాలయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: ఉత్తరాంధ్రలో గుర్తింపు పొందిన అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉద్యోగుల కొరత వేధిస్తున్నది. ఉన్న వారిపై పనిభారం అధికమవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ కమిటీలో ఉద్యోగులు మొత్తం 34 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా.. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, యూడీసీ, సూపర్‌వైజర్, అసిస్టెంట్ సెక్రటరీలు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులను నిర్వహిస్తున్నారు. మిగతా 30 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యదర్శి గ్రేడు-2 ఒకటి, డీఈ, ఏఈ, సూపర్‌వైజర్లు-2, ఎల్‌డీసీలు-4, టైపిస్ట్ -1, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు -4, డ్రైవర్ -1, వాచ్‌మెన్‌లు -10, అటెండర్లు -3, సహాయ మార్కెట్ సూపర్‌వైజర్లు -2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 18 మంది ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 12 మంది సెక్యూరిటీ గార్డులు, ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఒకరు ఎలక్ట్రీషియన్ ఉన్నారు. అయితే మార్కెట్ జూనియర్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో ఉన్న వారు నిత్యం మార్కెట్‌యార్డులో బెల్లం అమ్మకాలు జరిగేటప్పుడు పరిశీలన చేసి అమ్మకాల ధరలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న సిబ్బందే ఈ విధులను నిర్వహించడంతో వారిపై పని భారం అధికమైంది.

కమిటీలో పనిచేసే ఉద్యోగులు పదవీవిరమణ చేసినా, ఇతర కమిటీలకు బదిలీ అయిన వారి స్థానాల్లో నియామకాలు చేయడం లేదు. మొత్తం 34 మంది ఉద్యోగులు కమిటీ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉండగా రెగ్యులర్ ఉద్యోగులు నలుగురు, ఔట్‌సోర్సింగ్‌లో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో 12 ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై సెక్రటరీ శకుంతలను వివరణ కోరగా.. పోస్టుల విషయమై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నామన్నారు. అలాగే ప్రతిపాదనలు కూడా పంపుతున్నట్టు ఆమె చెప్పారు.

మట్టిలో మాణిక్యాలు

- ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులు
- పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం
- ఆపై ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువులు

నర్సీపట్నం, ఏప్రిల్ 12 : వ్యవసాయ కూలీలు, రైతుల కుటుంబాలలో పుట్టిన పిల్లలు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అద్భుత ఫలితాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకొని ఇంటర్ నర్సీపట్నంలోని పలు ప్రైవేటు కళాశాలలో చదివారు. గొలుగొండ మండలం కొత్తూరుకు చెందిన రైతు కె.నూకరాజు, మహాలక్ష్మి దంపతుల కుమార్తె త్రిపురాదేవి ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సంలో 463/470 మార్కులు సాధించింది. త్రిపురాదేవి చీడిగుమ్మల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చుదువుకొని ఇంటర్ నర్సీపట్నం ప్రగతి కళాశాలలో చదువుతోంది. నర్సీపట్నం గురందొరపాలెంలో ఎం.వీర్రాజు, భవానీల కుమార్తె నవ్య ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 983/1000 మార్కులు సాధించింది. నవ్య తండ్రి కూలిపని చేస్తుండగా, తల్లి ఇంటి వద్ద టైలరింగ్ చేసుకుంటూ కూతుర్ని చదివించుకుంటున్నారు. నర్సీపట్నంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన కె.దుర్గాగాయత్రి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 464 మార్కులు దక్కించుకుంది. ఈమె తండ్రి లోవరాజు వ్యవసాయ కూలీ, తల్లి సుజాత సాధారణ గృహిణి. మేడివాడ జడ్పీహెచ్‌లో పదో తరగతి వరకు చదువుకొని ఇంటర్ నర్సీపట్నం రిషి కళాశాలలో చదువుతోంది. నర్సీపట్నానికి చెందిన కె.యమున ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు 433 మార్కులు సాధించింది. తండ్రి కె.శ్రీనివాస్ కూలా, తల్లి దుర్గ సాధారణ గృహిణి. యమున వేములపూడి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుకొని ఇంటర్ శ్రీ విద్య జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఇలా పేదింటి బిడ్డలు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించడంతో పలువురు ప్రశంసలతో ముంచెత్తారు.

106 మంది వలంటీర్ల రాజీనామా

ఎలమంచిలి, ఏప్రిల్ 12: మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో శుక్రవారం 106 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్టు కమిషనర్ కొండలరావు తెలిపారు. పెదపల్లి, గొల్లలపాలెం వార్డులతో పాటు పలు వార్డుల్లోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సచివాలయ అడ్మిన్‌లకు అందజేసినట్టు తెలిపారు.

రాంబిల్లిలో 21 మంది వలంటీర్లు..

రాంబిల్లి, ఏప్రిల్ 12: మండలంలోని పలు సచివాలయాల పరిధిలోని 21 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్టు ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు. ఇప్పటికే 56 మంది వలంటీర్లు రాజీనామా చేశారని, ఇప్పుడు 21 మంది రాజీనామా చేశారన్నారు. వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్టు ఎంపీడీవో తెలిపారు.

పూర్తయిన ఈవీఎం, వీవీ ప్యాడ్‌ల ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


కార్యక్రమంలో పాల్గొన్న రవి పట్టన్‌శెట్టి, అధికారులు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 12: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం), వీవీ ప్యాడ్‌ల మొదటి ర్యాండమైజేషన్ శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలోని జాతీయ నాలుగు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. చోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలకు 315 వీవీ ప్యాడ్‌లు కేటాయించారు. మాడుగుల అసెంబ్లీకి 305 వీవీ ప్యాడ్‌లు, అనకాపల్లి నియోజకవర్గానికి 326 వీవీ ప్యాడ్‌లు కేటాయించారు. ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గానికి 319 వీవీ ప్యాడ్‌లు, పాయకరావుపేటకు 379 వీవీ ప్యాడ్స్, నర్సీపట్నం నియోజకవర్గానికి 340 వీవీ ప్యాడ్స్ కేటాయించారు. మొత్తం ఆరు నియోజకవర్గాలకుగాను 1984 వీవీ ప్యాడ్స్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరామ్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాడుగుల శివారులో గిరినాగు

- కళ్లాల వద్ద బుసలు కొడుతూ కనిపించిన పన్నెండు అడుగుల పాము
- చాకచక్యంగా పట్టుకుని దూరంగా విడిచిపెట్టి స్నేక్ క్యాచర్


గిరినాగును ప్రాణాలతో పట్టుకున్న స్నేక్ క్యాచర్ వెంకటేశ్

మాడుగుల, ఏప్రిల్ 12: మండల కేంద్రం మాడుగుల శివారు రామచంద్రపురం వెళ్లే దారిలో గల తుమ్మగంటి వారి కళ్లాల వద్ద శుక్రవారం ఉదయం పన్నెండు అడుగుల గిరినాగు హల్‌చల్ చేసింది. బుసలు కొడుతూ అక్కడివారిని భయపెట్టింది. దీంతో హడలిపోయినవారు స్నేక్ క్యాచర్ పెచ్చేటి వెంకటేశ్‌కు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న వెంకటేశ్ ఆ పామును చాకచక్యంగా ప్రాణాలతో పట్టుకున్నారు. అనంతరం దానిని సమీపంలో జనసంచారం లేని మెట్ట ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ పామును చూసేందుకు పరిసర గ్రామాల వారు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

పీటీడీ డిపోను సందర్శించిన ఈడీ


డిపో మేనేజర్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న ఈడీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: అనకాపల్లి పీటీడీ డిపోను విజయనగరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. రవికుమార్ శుక్రవారం సందర్శించారు. సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే అనకాపల్లి జిల్లా అత్యధికంగా ఆదాయం తెచ్చినందుకు పీటీడీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా డీపీటీవో కె. పద్మావతి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా జిల్లాలో సంక్రాంతి సందర్భంగా అనకాపల్లి డిపో అత్యధిక ఆదాయం సంపాదించినందుకు డిపో మేనేజర్ సుజాతకు, సూపర్‌వైజర్లకు ఈడీ రవికుమార్ ప్రశంసాపత్రాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ ఉన్నతాధికారి బి. అప్పలనాయుడు, డీపీటీవో పద్మావతి, డీఎం సుజాత, సూపర్‌వైజర్లు, గ్యారేజి సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజాగళాన్ని విజయవంతం చేయండి

▸▸ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 12: ఈనెల 14వ తేదీన పాయకరావుపేటలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజాగళం యాత్ర, రోడ్ షో జరుగుతుందని టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత కోరారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులతో విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు ప్రజాగళం రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సీఎం రమేశ్ సోదరుడు రాజేశ్, బుద్ద నాగజగదీశ్, గెడ్డం బుజ్జి, తోట నగేశ్, పరుచూరి భాస్కరరావు, రవిరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొండబాబు, లాలం కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

నక్కపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని రాజయ్యపేట శివారు బోయపాడు నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. శుక్రవారం మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య ఆధ్వర్యంలో మహిళలు, యువకులకు పార్టీ కండువాలు వేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, మడదా రాంబాబు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలి: పప్పల

ఎలమంచిలి, ఏప్రిల్ 12 : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌ను, అసెంబ్లీ అభ్యర్థిగా విజయ్‌కుమార్‌లను గెలిపించుకోవాలని కోరారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిమిలిలో కూటమి నేతల ప్రచారం



ప్రచారం చేస్తున్న కూటమి నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 12: మండలంలోని దిమిలిలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు, తదితరులు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బరిలో ఉన్న సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

యల్లయ్య గ్రోయిన్‌ను పరిశీలించిన కొణతాల

తుమ్మపాల, ఏప్రిల్ 12: తుమ్మపాల వద్ద శారదానదిపై గల యల్లయ్య గ్రోయిన్‌ను జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రోయిన్ల నిర్మాణాన్ని గాలికి వదిలేశారన్నారు. దీంతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటుందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కొణతాల ప్రచారం

తుమ్మపాల, ఏప్రిల్ 12: అనకాపల్లి మండలంలోని పాపయ్యపాలెం, సంతపాలెంల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'పేట'లో టీడీపీ జయహో బీసీ కార్యక్రమం

పాయకరావుపేట, ఏప్రిల్ 12 : స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం క్లస్టర్-4 పరిధిలోని బీసీ నాయకులతో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో బీసీల అభివృద్ధి జరిగిందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

రాంబిల్లి, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలో శుక్రవారంటీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ నాయకులు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, లాలం భవాని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ గుర్తు కమలం, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్ గాజుగ్లాస్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు వారు దశదిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఏప్రిల్ 12: మండలంలోని దార్లపూడి 32/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొత్తలి ఫీడర్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు. ఈ కారణంగా మండలంలోని కొత్తలి, పేరంటాలపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యప్పసేవా సమితి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ఎలమంచిలి, ఏప్రిల్ 12: పట్టణంలో మణికంఠ అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు బొడ్డేడ సురేష్ తెలిపారు. విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు అభిమానుల పర్యవేక్షణలో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

సాహితీ ఫార్మా ప్రమాదంపై గూడుపురాణి

... 5వ పేజీ తరువాయి

ఆరోపిస్తున్నారు. ఆ ప్రమాదం తరువాత ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో నాలుగు ప్రమాదాలు జరగడం గమనార్హం.

సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలడం వల్లే ప్రమాదం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనిని ప్రజా శాస్త్రవేత్తల బృందం తీవ్రంగా ఖండిస్తోంది. రసాయనాలను శుద్ధి చేసే సాహితీ ఫార్మాలో రియాక్టర్లు ఉండవని, రసాయనాలను వేడి చేయడానికి ఉపయోగించే రీబాయిలర్‌లో ప్రమాదం జరిగిందని పేర్కొంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. సాహితీ ఫార్మాలో అంతకు ముందు కూడా ఒకసారి ప్రమాదం జరిగిందని, అయినా ఆ సంస్థ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఎన్‌జీటీకి వివరించారు. ఈ ప్రమాదంపై అనకాపల్లి కలెక్టర్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక అందిందని, అయితే నిపుణులతో కూడిన కమిటీని కూడా నియమించారని, ఆ కమిటీ ఇంకా నివేదిక ఇవ్వకపోవడం దారుణమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపించారు. తక్షణమే ఈ కేసులో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేందుకు జిల్లా అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లో తగ్గిన ఇంటర్ ఉత్తీర్ణత

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: ప్రభుత్వ కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు దారుణంగా పడిపోయాయి. జిల్లాలో కేజీబీవీల్లో ఫలితాలు కొంత వరకు ఆశాజనంగా ఉన్నాయి. అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు నిరాశ కలిగించాయి. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించింది. అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి ఇంటర్ పరీక్షలకు 56 మంది హాజరుకాగా 12 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 56 మందికి 29 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

పాయకరావుపేటలో.. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 178 మంది విద్యార్థుల్లో 49 మంది ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 84 మంది పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో 94 పరీక్షలు రాయగా 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

సబ్బవరంలో.. స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలు రాసిన 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 18 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 17 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో బైపీసీ 32 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారని ఎస్‌వో మృధుల తెలిపారు. ఉత్తీర్ణులైన వారంతా ప్రథమ శ్రేణి సాధించారని ఆమె చెప్పారు. ప్రథమ సంవత్సరం 33 మంది బాలికలు పరీక్షలు రాయగా శత శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో 73 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 53 మంది ఉత్తీర్ణులయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తి తెలిపారు. అదే విధంగా ఒకేషనల్ కోర్సుల్లో 160 మంది పరీక్షలు రాయగా 124 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మొదటి సంవత్సరంలో 84 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 45మంది, ఒకేషనల్ విద్యార్థులు 168 మంది పరీక్షలు రాయగా 116 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

కశింకోటలో.. మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 95శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ జి.గ్రేస్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 53 మంది పరీక్షలు రాయగా 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 66 మంది రాయగా 63మంది విద్యార్థులు ఉత్తీర్ణలయ్యారన్నారు. అలాగే తేగాడ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 29 మంది పరీక్షలు రాయగా 29 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ తెలిపారు. కె.రాజులమ్మ 440/429 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

పరవాడలో.. ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో తానాం మహాత్మాజ్యోతిబాయిఫూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 110 మంది బాలికలు పరీక్ష రాయగా 106 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తెలిపారు. బైపీసీకి చెందిన విద్యార్థినీ కె. తిరుమల 984 /1000 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే బి. ఆసినీ 969/1000, ఇ.ధనలక్ష్మి 958/1000 మార్కులు సాధించినట్టు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 134 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 130 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విద్యార్థినీ పి. మేఘన 455/470 మార్కులు, బైపీసీ విద్యార్థినీ సీహెచ్. శిరీషా 426/440 మార్కులు, ఎంఈసీ వి.లక్ష్మి విద్యార్థినీ 479/500 మార్కులు పొందారు. అలాగే పరవాడ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 155 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 55 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 138 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 84 మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 31 శాతం, ద్వితీయ సంవత్సరంలో 37 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ రాజశ్రీ తెలిపారు. మొదటి సంవత్సరంలో 26 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా ఎనిమిది మంది పాసయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 19 మంది పరీక్షలు రాయగా.. ఏడుగురు పాసయ్యారన్నారు.

ఎలమంచిలిలో.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డా.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఇంటర్ ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 379 మంది పరీక్షలకు హాజరుకాగా 99 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 311 మంది పరీక్షలకు హాజరుకాగా 154 మంది ఉత్తీర్ణత సాధించారు. డా.బీఆర్. అంబేడ్కర్ స్కూలులో మొదటి సంవత్సరంలో 69 మందికి 59 మంది, ద్వితీయ సంవత్సరంలో 72 మందికి 68 మంది పాసయ్యారు.

కోటవురట్లలో.. స్థానిక కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ సరితదేవి తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో 18 మంది విద్యార్థినులకు 16 మంది ఉత్తీర్ణత సాధించారని, ద్వితీయ సంవత్సరంలో 14 మంది విద్యార్థినులకు 14 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో 89 శాతం, రెండో సంవత్సరంలో శత శాతం ఫలితాలు వచ్చాయన్నారు. తమ కళాశాల విద్యార్థిని ఆర్.అనురాధ 951/1000 మార్కులు సాధించి మండల టాపర్ నిలిచినట్టు ప్రిన్సిపాల్ సరితదేవి తెలిపారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 88 మంది విద్యార్థులకు 28 ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 82 మందికి 51మంది పాస య్యారని ఆమె తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో ఫస్ట్ ఇయర్‌లో 57 మందికి 32 మంది పాసయ్యారు.సెకండ్ ఇయర్‌లో 42 మందికి 34 మంది పాసయినట్టు ప్రిన్సిపాల్‌గా సుజాత తెలిపారు.

నక్కపల్లిలో.. స్థానిక కేజీబీవీ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరంలో పి.భవానీ 440 మార్కులకు 430 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 32 మంది బాలికలు పరీక్షలు రాయగా, 26 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 26 మంది బాలికలలు పరీక్షలు రాయగా 17 మంది ఉత్తీర్ణత సాధించినట్టు కేజీబీవీ ఎస్‌వో షేక్ సలీమా తెలిపారు. అలాగే నక్కపల్లి డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకులం ద్వితీయ సంవత్సరంలో 52మంది బాలికలు పరీక్షలు రాయగా 42 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సువర్ణకుమారి చెప్పారు. సెకండ్ ఎంపీసీలో బోడపాటి అనూష 881 మార్కులు సాధించగా, బైపీసీలో గుల్ల మల్లిక 937 మార్కులు సాధించినట్టు చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 42మంది బాలికలు పరీక్షలు రాయగా 82.35శాతం ఫలితాలు వచ్చాయి. 42మంది బాలికలు పరీక్షలు రాయగా 33మంది పాసయ్యారు. బైపీసీలో పూజారి ప్రేమాన్విత 414 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది.

ఇంటర్ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



టి.వెన్నెల



డీడీ.సాయి శ్రీనివాస్



కె.లాస్య నందిని



సాయి నిహారిక



ఎస్.మేఘన



జి.వర్షిణి

పాయకరావుపేట, ఏప్రిల్ 12 : ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. శుక్రవారం విద్యా సంస్థల యాజమాన్యం అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో టి.వెన్నెల 982/1000, డీడీ.సాయిశ్రీనివాస్ 980/1000 మార్కులు, బైపీసీలో కె.లాస్య నందిని 979/1000 మార్కులు సాధించారు. అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో డీవీఎస్.సాయి నిహారిక 464/470, ఎస్.మేఘన 463/470 మార్కులు, బైపీసీలో జి.వర్షిణి 428/440 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మాజీ ఎంపీపీ బాబూరావు కన్నుమూత



బాబూరావు పాడెను మోస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఉన్నారు. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన బాబూరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12 : మాజీ ఎంపీపీ కొణతాల బాబూరావు (74) శుక్రవారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నారు. ఈయన ఎంపీపీగా పోటీ చేసి విజయం సాధించారు. బాబూరావు మరణం వార్త విన్న విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు సీఎం రమేశ్, కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, దాడి జగన్ ప్రభాకర్, మళ్ల సురేంద్ర, గౌరీ సంఘం పెద్దలు బుద్ద శివాజీ, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ బాబురావు పార్థివదేహానికి నివాళులు అర్పించారు. బాబురావుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం జరిగిన బాబురావు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాడి మోశారు.

బాలికలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

ఉత్తీర్ణులయ్యారు. 73 శాతం ఫలితాలు సాధించారు. 170 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. కశింకోట కేజీబీవీ నుంచి ప్రథమ సంవత్సర బైపీసీ బాలికలు 29 మంది పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర బాలికలు 467 మంది పరీక్షలు రాయగా, వారిలో 388 మంది ఉత్తీర్ణత సాధించి 79 శాతం నమోదు చేశారు. గొలుగొండ, కోటవురట్ల కేజీబీవీల్లో నూటికి నూరు శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు ధమాల్

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,397 మంది పరీక్షలకు హాజరుకాగా, కేవలం 700 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం 30 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,023 మంది పరీక్షలు రాయగా, వారిలో 1,070 మంది ఉత్తీర్ణులయ్యారు. 53 శాతం నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్టు అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, పరీక్షలు కేవలం రెండు మూడు నెలలు ఉందనగా కాంట్రాక్టు ప్రాతిపదికన అధ్యాపకుల నియామకాలు చేపట్టడం, ఏడాది పొడవునా ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తామన్న పాఠ్యపుస్తకాలు పంపిణీ జరగకపోవడం వంటి కారణాలతో ఇంటర్ ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని చెబుతున్నారు.

హైస్కూల్ ప్లస్-2 కళాశాలల్లో...

జిల్లాలో అనకాపల్లి మండలం కూండ్రం, పరవాడ, పాయకరావుపేట, ఎలమంచిలి జడ్పీ హైస్కూళ్లలో ప్లస్-2 కళాశాలలు ఉన్నాయి. కూండ్రంలో ప్రథమ సంవత్సర పరీక్షలు 19 మంది రాయగా ఆరుగురు, ద్వితీయ సంవత్సరం 10 మంది పరీక్షలు రాయగా నలుగురు ఉత్తీర్ణత సాధించారు. పరవాడ జడ్పీ హెచ్‌ఎస్‌లో 26 మందికి 8 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఇంటర్ పరీక్షకు 19 మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. పాయకరావుపేట జడ్పీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20 మంది పరీక్షలు రాస్తే ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు. ఎలమంచిలి జడ్పీలో 35 మంది పరీక్షలు రాయగా, 10 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 13 మంది పరీక్షలకు హాజరు కాగా 9 మంది ఉత్తీర్ణులయ్యారు.

మోడల్ హైస్కూళ్లలో మెరుగైన ఫలితాలు

జిల్లాలో చీడికాడ, నర్సీపట్నం మండలం వేములపూడి, రావికమతం మండలం మురపాక, మునగపాక మండలం పాటిపల్లి, కశింకోట మండలం తేగాడల్లో ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్లలో ప్రథమ సంవత్సర ఇంటర్ పరీక్షలకు 345 మంది హాజరు కాగా 271 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 395 మంది పరీక్షలు రాయగా 320 మంది ఉత్తీర్ణులయ్యారు.

కాలేజీ బస్సు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

టిఫిన్ సెంటర్ వద్ద ఆగారు. టిఫిన్ సెంటర్ వ్యాన్ మీదకు బస్సు దూసుకువెళ్లడంతో కారులో వచ్చిన షేక్ గౌస్ మొహిద్దీన్ (12) అక్కడికక్కడే మృతిచెందగా, ఆ సమయంలో అక్కడున్న పది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో షేక్ గౌస్ మొహిద్దీన్ తండ్రి షేక్ రెహమాన్, తల్లి షేక్ మున్నీ బేగమ్, సోదరి షేక్ జరీనా బేగమ్, పెందుర్తికి చెందిన కారు డ్రైవర్ అహ్మద్, సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నడుపుతున్న గొల్లవిల్లి రమణమ్మ, ఇంకా బయ్యవరానికి చెందిన గొన్నాబత్తుల లక్ష్మి, తిర్రి అనిల్‌కుమార్, కరణం లక్ష్మణరావు, ఎస్.రామకృష్ణ (అనకాపల్లి) గాయపడ్డారు. వీరిలో రామకృష్ణ, మున్నీ బేగమ్‌ల పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలిసి సీఐ వినోద్‌బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల్లో కొందరిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి, మరికొందరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

దర్గాకు వెళుతుండగా...

ప్రమాదంలో మృతిచెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ ఆరో తరగతి చదువుతున్నాడు. మొహిద్దీన్ పెద్ద అక్కకు ఈ నెల 26న వివాహం జరగనున్నది. ఈ నేపథ్యంలో దర్గాకు బయలుదేరారు. మార్గమధ్యంలో అల్పాహారానికి ఆగినప్పుడు ఊహించని విధంగా ప్రమాదం ముంచుకొచ్చింది.

క్షతగాత్రులకు పరామర్శ

బస్సు ప్రమాదంలో మృతిచెందిన గౌస్, వారి కుటుంబ సభ్యులను అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పరామర్శించారు. అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రభుత్వం మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఇప్పుడే గుర్తుకొచ్చెనా..

... 5వ పేజీ తరువాయి

హడావిడిగా కానిస్తున్నారు.

అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు పనులు

అనకాపల్లి నుంచి వయా మునగపాక అచ్యుతాపురం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు గత కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేపు మాపు అంటూ కాలం గడిపేశారు. ఈ రోడ్డు విస్తరణకు కనీసం భూ సేకరణ పనులు పూర్తి చేయలేకపోయారు. కాగా గత నెలలో ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆదరాబాదరాగా వీఎంఆర్‌డీఏ నిధులు రూ.6.5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. పాత రోడ్డు విస్తరణ జోలికి పోకుండా అడుగడుగునా గోతులతో వాహనదారులకు నరకం చూపిస్తున్న అనకాపల్లి వయా మునగపాక అచ్యుతాపురం సుమారు 13 కిలోమీటర్ల పాత రోడ్డుపైనే ఒక లేయర్ తారు వేసి రోడ్డు పనులు వేగంగా చేస్తున్నారు.

ఎన్నికల స్టంటేనా?

జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలునాయుడు ఐదేళ్లుగా తన సొంత నియోజకవర్గమైన మాడుగులకే పరిమితమయ్యారని పార్టీ వర్గీయులే చెబుతుంటారు. రెండేళ్ల కిందట ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లాలో ఇతర నియోజకవర్గాల అభివృద్ధి గురించి ఏనాడు పట్టించుకోలేదు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగులను ఆనుకొని వున్న చోడవరం నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి గుర్తించి జనం గగ్గోలు పెడుతున్నా అటువైపు కన్నెత్తైనా చూడలేదు. కాగా రానున్న ఎన్నికల్లో బూడి ముత్యాలునాయుడు అనకాపల్లి లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నందునే ఓటర్లు ప్రశ్నిస్తారనే భయంతో హడావిడిగా ఆగిన రోడ్లు వేయిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



తిమ్మరాజుపేటలో పూసిన బ్రహ్మకమలాలు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని తిమ్మరాజుపేటలో అరుదైన బ్రహ్మకమలాలు శుక్రవారం వికసించాయి. హిమాలయాలలో మాత్రమే కనిపించే ఈ బ్రహ్మకమలం పంచాయతీ కార్యదర్శి గోవిందరావు ఇంటిలో వికసించింది. గత ఏడాదిలో బెంగళూరులో కొనుగోలు చేసి పెంచాడు. మూడు బ్రహ్మకమలాలు పూయడం ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూలను చూడడానికి పలువురు ఆసక్తి కనపరిచారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

నక్కపల్లి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో ఆంజనేయస్వామి మందిరం హైవే వద్ద శుక్రవారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైవేపై ప్రయాణించే వారందరికి సాయి భక్తులు చల్లని మజ్జిగను సరఫరా చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి ప్రతినిధులు కక్కిరాల సురేశ్, కొత్త రాము, ఎన్.విశ్వేశ్వరరావు, నవర నూకరాజు శర్మ, బండారు రాజేశ్వరరావు, నున్న కాశీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, ఏప్రిల్ 12: మండలంలోని దేవీపురం రాజరాజేశ్వరి దేవి పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం పంచదశి మంత్ర జపం, అభిషేకాలు, శోడషోపచార పూజ, లలితా హోమం, కళావాహన, లక్ష కుంకుమార్చన, ఉచిత ప్రసాద వితరణ జరిగాయి. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ విద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో కూటమి అభ్యర్థుల ప్రచారం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గెలుపొందిన వెంటనే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సర్పంచ్ సాలాపు శాంతి, టీడీపీ నాయకులు సాలాపు సూరిఅప్పారావు, అక్కిరెడ్డి రమణబాబు పాల్గొన్నారు.

రాంకీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ

పరవాడ, ఏప్రిల్ 12 : విశాఖ ఫార్మాసిటీలో గల రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని కార్మికులతోపాటు పాదచారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధరభక్షి, లైజనింగ్ అధికారి పి.రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె. శ్రీకాంత్, రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 12: మండలంలోని కొత్తూరు వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు సేనాపతి సన్యాసిరావు, దిమిలికి చెందిన వైసీపీ నేత నగిరెడ్డి వెంకటరమణ శుక్రవారం అచ్యుతాపురంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి విజయకుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు డీఎస్ఎన్‌రాజు, ద్వారపురెడ్డి బాజ్జి, పైలరామునాయుడు, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్‌నాయుడు పాల్గొన్నారు.

గొట్టివాడలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కోటవురట్ల, ఏప్రిల్ 12: మండలంలోని గొట్టివాడలో శుక్రవారం మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు మాణిక్యం, అతని అనుచరులు టీడీపీలో చేశారు. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఆ గ్రామ టీడీపీ నాయకుడు సుంకర బాబ్జీ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, కూరందాసు నూకరాజు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరించిన దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్,ఏప్రిల్ 12 : స్థానిక పెదరామస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీన జరగనున్న శ్రీరామ నవమి వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 15వ తేదీన ఉదయం 8.52 గంటలకు కల్యాణ రాట ముహూర్తంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని రత్నాకర్ తెలిపారు. 17న ఉదయం పదిన్నర గంటలకు సీతారాముల కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కొణతాల అప్పలనాయుడు, కొణతాల గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

కోటవురట్ల, ఏప్రిల్ 12: మండలంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు శుక్రవారం అన్నవరం, సుంకపూర్, యండపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 12 : మండలంలోని నాగవరంలో శుక్రవారం పోలీసులు ముమ్మర వాహన తనిఖీలను చేపట్టారు. ఓవర్‌లోడుతో వెళ్తున్న తొమ్మిది టిప్పర్ లారీలపై కేసులు నమోదు చేసి ఐదు లక్షల 51వేల 110రూపాయలు అపరాధ రుసుము విధించారు. ఈసందర్భంగా ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించరాదన్నారు.

జనసేన అభ్యర్థి ఎన్నికల ప్రచారం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 12 : మండలంలోని గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల అభివృద్ధికి కూటమిని ఆశీర్వదించండి

» చీడికాడ బహిరంగ సభలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

చీడికాడ, ఏప్రిల్ 12 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని, తిరిగి పూర్వ వైభవం పొందాలంటే అంతా కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అనకాపల్లి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం చీడికాడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో అన్నివిధాలా వెనుకబడి ఉన్న మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి తనను అంతా గెలిపించాల్సిందిగా కోరారు. నియోజకవర్గంలో విద్య వైద్యం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఈ నియోజకవర్గాన్ని రాష్ట్ర హైవే రోడ్లకు అనుసంధానం చేసి రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతులకు సాగునీటి కల్పనకు తనవంతు కృషిచేస్తానని వివరించారు. వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తానన్నారు. ఉత్తరాంధ్రను దోచుకుతింటున్న రెడ్ల పాలనకు స్వస్తి పలికేందుకు అందరూ కష్టపడి పనిచేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా పైలా ప్రసాదరావును అత్యధిక ఓట్ల మెజార్టీ గెలిపించాల్సిందిగా కోరారు. అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపిస్తే అయన ఢిల్లీ వెళ్లి ఏమి మాట్లాడగలరని ప్రశ్నించారు. మాడుగుల నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అందరి దురదృష్టకరమన్నారు. ఇక్కడి డిప్యూటీ సీఎం మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి కంటే భూములు దోపిడీ, ఇసుక దోపిడీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, పార్టీ మాడుగుల, చోడవరం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి, మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, జనసేన రెండు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు రాయపురెడ్డి కృష్ణ, పీఎస్ఎన్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అరాచక వైసీపీని గద్దె దించండి'



ప్రచార సభలో పాల్గొన్న మాజీ మంత్రి అయ్యన్న

గొలుగొండ, ఏప్రిల్ 12 : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలన్నా ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రజలంతా గెలిపించాలని మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు కోరారు. కొత్తఎల్లవరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీని గద్దె దించేందుకు అంతా ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, సుర్ల బాబ్జీ, ఆదపురెడ్డి గోపాలకృష్ణ, చిటికెల సాంబమూర్తి, కె.రవివర్మ, రాజాన వీరసూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

ఉత్తీర్ణులయ్యారు. 73 శాతం ఫలితాలు సాధించారు. 170 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. కశింకోట కేజీబీవీ నుంచి ప్రథమ సంవత్సర బైపీసీ బాలికలు 29 మంది పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర బాలికలు 467 మంది పరీక్షలు రాయగా, వారిలో 388 మంది ఉత్తీర్ణత సాధించి 79 శాతం నమోదు చేశారు. గొలుగొండ, కోటవురట్ల కేజీబీవీల్లో నూటికి నూరు శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు ఢమాల్

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,397 మంది పరీక్షలకు హాజరుకాగా, కేవలం 700 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం 30 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,023 మంది పరీక్షలు రాయగా, వారిలో 1,070 మంది ఉత్తీర్ణులయ్యారు. 53 శాతం నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్టు అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, పరీక్షలు కేవలం రెండు మూడు నెలలు ఉందనగా కాంట్రాక్టు ప్రాతిపదికన అధ్యాపకుల నియామకాలు చేపట్టడం, ఏడాది పొడవునా ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తామన్న పాఠ్యపుస్తకాలు పంపిణీ జరగకపోవడం వంటి కారణాలతో ఇంటర్ ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని చెబుతున్నారు.

హైస్కూళ్లలోని ప్లస్-2 కళాశాలల్లో...

జిల్లాలో అనకాపల్లి మండలం కూండ్రం, పరవాడ, పాయకరావుపేట, ఎలమంచిలి జడ్పీ హైస్కూళ్లలో ప్లస్-2 కళాశాలలు ఉన్నాయి. కూండ్రంలో ప్రథమ సంవత్సర పరీక్షలు 19 మంది రాయగా ఆరుగురు, ద్వితీయ సంవత్సరం 10 మంది పరీక్షలు రాయగా నలుగురు ఉత్తీర్ణత సాధించారు. పరవాడ జడ్పీ హెచ్‌ఎస్‌లో 26 మందికి 8 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఇంటర్ పరీక్షకు 19 మందికి ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు. పాయకరావుపేట జడ్పీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20 మంది పరీక్షలు రాస్తే ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు. ఎలమంచిలి జడ్పీలో 35 మంది పరీక్షలు రాయగా, 10 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 13 మంది పరీక్షలకు హాజరు కాగా 9 మంది ఉత్తీర్ణులయ్యారు.

మోడల్ హైస్కూళ్లలో మెరుగైన ఫలితాలు

జిల్లాలో చీడికాడ, నర్సీపట్నం మండలం వేములపూడి, రావికమతం మండలం మురపాక, మునగపాక మండలం పాటిపల్లి, కశింకోట మండలం తేగాడల్లో ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్లలో ప్రథమ సంవత్సర ఇంటర్ పరీక్షలకు 345 మంది హాజరు కాగా 271 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 395 మంది పరీక్షలు రాయగా 320 మంది ఉత్తీర్ణులయ్యారు.

కాలేజీ బస్సు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

టిఫిన్ సెంటర్ వద్ద ఆగారు. టిఫిన్ సెంటర్ వ్యాన్ మీదకు బస్సు దూసుకువెళ్లడంతో కారులో వచ్చిన షేక్ గౌస్ మొహిద్దీన్ (12) అక్కడికక్కడే మృతిచెందగా, ఆ సమయంలో అక్కడున్న పది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో షేక్ గౌస్ మొహిద్దీన్ తండ్రి షేక్ రెహమాన్, తల్లి షేక్ మున్నీ బేగమ్, సోదరి షేక్ జరీనా బేగమ్, పెందుర్తికి చెందిన కారు డ్రైవర్ అహ్మద్, సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నడుపుతున్న గొల్లవిల్లి రమణమ్మ, ఇంకా బయ్యవరానికి చెందిన గొన్నాబత్తుల లక్ష్మి, తిర్రి అనిల్‌కుమార్, కరణం లక్ష్మణరావు, ఎస్.రామకృష్ణ (అనకాపల్లి) గాయపడ్డారు. వీరిలో రామకృష్ణ, మున్నీ బేగమ్‌ల పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలిసి సీఐ వినోద్‌బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల్లో కొందరిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి, మరికొందరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

దర్గాకు వెళుతుండగా...

ప్రమాదంలో మృతిచెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ ఆరో తరగతి చదువుతున్నాడు. మొహిద్దీన్ పెద్ద అక్కకు ఈ నెల 26న వివాహం జరగనున్నది. ఈ నేపథ్యంలో దర్గాకు బయలుదేరారు. మార్గమధ్యంలో అల్పాహారానికి ఆగినప్పుడు ఊహించని విధంగా ప్రమాదం ముంచుకొచ్చింది.

క్షతగాత్రులకు పరామర్శ

బస్సు ప్రమాదంలో మృతిచెందిన గౌస్, వారి కుటుంబ సభ్యులను అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పరామర్శించారు. అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రభుత్వం మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటర్‌లో మిశ్రమ ఫలితాలు

» ప్రథమ సంవత్సరంలో బాగా తగ్గిన ఉత్తీర్ణతా శాతం

» ద్వితీయ సంవత్సరంలో కాస్త మెరుగు

» కేజీబీవీ, గురుకులాల్లో సత్ఫలితాలు



ఎస్.కార్తీక్, 967, తెనుగుపూడి గురుకులం, దేవరాపల్లి



ఎస్.జస్మిత, 934, కేజీబీవీ, గర్నికం, రావికమతం మండలం



నైథాన జ్యోతి, 956, బైపీసీ, వడ్డాది కేజీబీవీ, బుచ్చెయ్యపేట



ఎం.గౌతమి, ఎంపీసీ 463, జూనియర్ కళాశాల, రోలుగుంట

చోడవరం, ఏప్రిల్ 12 : ఇంటర్‌లో ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో చాలామంది విద్యార్థులు తప్పగా, ద్వితీయ సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించారు.చోడవరం, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 36శాతం, ద్వితీయ సంవత్సరంలో 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్‌లో 192మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, ఇందులో 40మంది మాత్రమే పాసయ్యారు. ఒకేషనల్ గ్రూప్‌లో 175మందికి 72 మంది పాసయ్యారు. రెండు గ్రూపులకు కలిపి మొత్తం 367మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, అందులో 132మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 184మందికి గాను 57మంది పాసయ్యారు. ఒకేషనల్ విభాగంలో 133కి 84మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ రెండు గ్రూపుల నుంచి మొత్తం 317మంది పరీక్షలకు హాజరుకాగా, 141 మంది పాసై 45శాతం ఉత్తీర్ణత సాధించారు.

నర్సీపట్నం : ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఏబీఎం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఇ.జాహ్నవి 484, జి.చిన్న 475, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బి.లీలా మంగవతి 914, ఎస్.చంద్రకళ 902 మార్కులు సాధించారు. కళాశాల కరస్పాండెంట్ అంకంరెడ్డి గిరి విద్యార్థులను అభినందించారు. అలాగే, వివేకానంద జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో ఎస్.దుర్గాభవానీ 980, ఎ.సూర్యకళ 975, సీహెచ్ జాన్సీ 971 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ ఏఎస్ఎస్‌జీ దొరబాబు అభినందించారు.

నర్సీపట్నం అర్బన్ : ఇంటర్‌లో వేములపూడి కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాల మెరుగైన ఫలితాలు సాధించాయి. కేజీబీవీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 58 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 71 శాతం సాధించినట్టు ఎస్ఓ శాంతి తెలిపారు. ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 81 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపల్ సంధ్య తెలిపారు.

గొలుగొండ : మండలంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల నుంచి 49 మంది పరీక్షలకు హాజరుకాగా, 46 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన 43 మంది విద్యార్థులు హాజరుకు కాగా, పది మంది మాత్రమే పాసయ్యారు. ఇదిలావుంటే, గొలుగొండ కేజీబీవీలో చదువుతున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం 34 మంది విద్యార్థినులు హాజరుకాగా, శత శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 37 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా, 31మంది పాసయ్యారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం 109మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా, 73మంది ఉత్తీర్ణత పొందారు. ప్రథమ సంవత్సరం 98 మందికి 28మంది పాసైనట్టు ప్రిన్సిపాల్ కె.శ్రీహరి తెలిపారు. వీరికి ప్రినిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మాకవరపాలెం : మండల కేంద్రం మాకవరపాలెంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 47.5 శాతం ఉత్తీ ర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సుదర్శనరావు తెలిపారు. ప్రథమ సంవత్సరం అన్ని గ్రూపులకు సంబంధించి 99మంది పరీక్షలు రాయగా 28మంది పాసైనట్టు చెప్పారు. ద్వితీయ సంవత్సరం అన్ని గ్రూపుల నుంచి 102 మంది పరీక్ష రాయగా, 48మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

రోలుగుంట : ఇంటర్ ఫలితాల్లో ఈ ఏడాది రోలుగుంట జూనియర్ కళాశాల, కేజీబీవీ విద్యాలయం మెరుగైన ఫలితాలు సాధించాయి. రోలుగుంట జూనియర్ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలకు 166 మంది హాజరు కాగా 99 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం 124 మంది హాజరు కాగా 106 మంది పాసైనట్టు ప్రిన్సిపల్ బి.సహదేవుడు తెలిపారు. కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి ఏడాది పరీక్షలకు 37 మందికి 36 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 25 మందికి 24 మంది ఉత్తీర్ణత పొందారని ఎస్‌వో తులసీ తెలిపారు.

రావికమతం : ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థులు చక్కని ఫలితాలు సాధించారు. 101 మంది పరీక్షలకు హాజరుకాగా, 90మంది ఉత్తీర్ణులయ్యారు. గర్నికం కేజీబీవీనుంచి 23మంది పరీక్షలు రాయకగా, 20 మంది పాసయ్యారు. గర్నికం కేజీబీవీ నుంచి 23 మందికి 20 మంది ఉత్తీర్ణులయ్యారు. కొత్తకోట జూనియర్ కళాశాల నుంచి 76 మంది పరీక్షలకు హాజరుకాగా, 55మంది పాసయ్యారు. వీరిలో గర్నికం కేజీబీవీ బైపీసీ విద్యార్థిని ఎస్.జస్మిత 934 మార్కులు సాధించింది. ఇదిలావుంటే, కొత్తకోట జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 23మందికిగారు 13మంది పాసయ్యారు.

బుచ్చెయ్యపేట : ఇంటర్‌లో వడ్డాది కేజీబీవీ విద్యార్థినులు చక్కని ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం 34 మంది పరీక్షలు పరీక్షలకు హాజరు కాగా, 31 మంది (92 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 37మందికి 27 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీ విద్యార్థిని ఎన్.జ్యోతి 956, ఎం.నాగమణి 953 పొందారు. వడ్డాది జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 65 మందికి 30 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 70 మంది పరీక్షలు రాయగా, కేవలం 15 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

మాడుగుల: మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఒకేషనల్, జనరల్‌కు చెందిన 240మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 88మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సానికి సంబంధించి 210మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 104 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో మోసూరి తేజ 971 మార్కులు సాధించగా, ఆకుల ఆశ్రిత 918, బైపీసీ విద్యార్థిని ద్రాక్షారపు మేఘన 844, ఒకేషనల్ మెకానికల్ ఆటో మెకానికల్ ఇంజనీర్ నుంచి కె.జగన్ 946 మార్కులు పొందారు.

చీడికాడ : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇక్కడ ప్రథమ సంవత్సరంలో 55 మంది పరీక్షలకు హాజరుకాగా 39 మంది, ద్వితీయ సంవత్సరంలో 63 మందికి 39 మంది పాసయ్యారు. కోనాం గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 36 మందికి 26 మంది, ద్వితీయ సంవత్సరం 51 మందికి 30మంది ఉత్తీర్ణులయ్యారు. జి.కొత్తపల్లి కేజీబీవీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 40శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు నిరాశపరిచాయి. ప్రథమ సంవత్సరం (జనరల్) 89 మంది పరీక్షలకు హాజరు కాగా, వీరిలో కేవలం 8మంది మాత్రమే పాసయ్యారు. ఒకేషనల్ కోర్సులో 25 మంది పరీక్ష రాయగా 9మంది మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 93 మందిలో 37మంది, ఒకేషనల్ కోర్సులో 49 మందిలో 31 మంది ఉత్తీర్ణులయ్యారు. తెనుగుపూడి గురుకుల కళాశాల ప్రథమ సంవత్సరం 50 మంది హాజరు కాగా, కేవలం 9మంది మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 55మందికి 16 మంది మాత్రమే ఉత్తీర్ణత పొందారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న సబ్బవరపు కార్తీక్ 967 మార్కులు సాధించాడు. బేతపూడి కేజీబీవీలో 24 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా 19మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 11మందిలో 8మంది ఉత్తీర్ణత పొందారు.

మూగ రోదన.. ఎవరికీ పట్టని రైతు వేదన!

» ఒకే రోజు నాతవరం మండలంలో తెరచుకోని మూడు పశువైద్య కేంద్రాలు

» పశువులను వైద్యానికి తెచ్చినవారు ఎదురుచూపులు

» ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంపై అంతా ఆగ్రహం



మధ్యాహ్నం 12 గంటలైనా శృంగవరంలో తెరచుకోని పశువైద్య కేంద్రం



శృంగవరం ఆస్పత్రి వద్ద పశు వైద్యాధికారి కోసం ఎదురు చూస్తున్న పాడి రైతు

నాతవరం, ఏప్రిల్ 12 : ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం మూగ జీవాలకు ప్రాణసంకటంగా మారింది. ఇందుకు ఉదాహరణగా నాతవరం మండలంలో గల మూడు పశువైద్య కేంద్రాలు శుక్రవారం మూతపడడాన్ని చెప్పవచ్చు. ఈ మండలంలో నాతవరం, గునుపూడి, శృంగవరం గ్రామాలలో పశు వైద్యకేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒక్క గునుపూడి పశు వైద్య కేంద్రంలో మాత్రమే పశువైద్యాధికారి ఉన్నారు. ఇతనినే నాతవరం, శృంగవరం పశు వైద్యకేంద్రాలకు వారంలో కొన్ని రోజులు డిప్యూటేషన్ వేశారు. శృంగవరం పశు వైద్య కేంద్రం వారంలో రెండు మూడు రోజులు మాత్రమే తెరచుకుని ఉంటుందని, మిగతా రోజులు మూసే ఉంటుందని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వ్యాధులకు గురైన పశువులను చుట్టు పక్కల గ్రామాల నుంచి అష్టకష్టాలు పడి ఆస్పత్రికి తీసుకు రావడం, తీరా ఇక్కడ వైద్యాధికారి లేకపోవడంతో మళ్లీ తిరుగుముఖం పట్టడం తమకు పరిపాటిగా మారిందని పలువురు వాపోతున్నారు. ఇదిలావుంటే, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలైనా శృంగవరం పశు వైద్య కేంద్రం తెరుచుకోలేదని పలువురు తెలిపారు. అలాగే, మండల కేంద్రంలోని నాతవరం పశువైద్య కేంద్రం, గునుపూడి పశువైద్య కేంద్రం కూడా శుక్రవారం తెరుచుకోలేదని పాడి రైతులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడినందునే నేడు ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. పాడి సంపదను వృద్ధి చేసేందుకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన సదరు సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశువైద్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు నిర్ణీత వేళల్లో ఆస్పత్రులు తెరచి ఉంచేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు. నాతవరం పశు వైద్యకేంద్రం, గునుపూడి పశువైద్యకేంద్రం తెరచుకోలేదని, అలాగే, శృంగవరంలోని పశు వైద్యకేంద్రం మధ్యాహ్నం పన్నెండు గంటలైనా తెరచుకోలేదన్న పాడిరైతుల ఆరోపణలను పశు సంవర్థక శాఖ పాయకరావుపేట ఏడీ శ్రీనువాసరావు వద్ద ప్రస్తావించగా, పశు వైద్య కేంద్రాలు ఎందుకు తెరుచుకోలేదో తెలుసుకుంటానని వివరించారు.

పెడిమికొండ నీలగిరి తోటల్లో అగ్ని ప్రమాదం

» ఎండుటాకులకు అంటుకున్న నిప్పు » క్షణాల్లో పాకిన మంటలు » అప్రమత్తమైన రైతులు



నీలగిరి తోటలో ఎగసిపడుతున్న మంటలు

నాతవరం, ఏప్రిల్ 12 : మండలంలోని పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో ఇరవై సంవత్సరాల క్రితం వన సంరక్షణ సమితి సభ్యులు పెంచిన నీలగిరి తోటల్లో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. తోటల్లో కింద పడి ఉన్న ఎండుటాకులకు నిప్పంటుకుంది. అదే సమయంలో గాలులు వీచడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు నర్సీపట్నం అగ్నిపమాక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అయితే ఈ తోటల పక్కనే ఉన్న జీడిమామిడి తోటల రైతులు వెంటనే మేల్కొని తమ జీడి తోటలకు మంటలు పాకకుండా సమీపంలో ఉన్న నీటిని తీసుకువచ్చి నీలగిరి తోటలలో మంటలను ఆర్పివేశారు. అప్పటికే చాలావరకు చెట్లు కాలిపోయాయని పలువురు రైతులు తెలిపారు.

కోర్టు ఆదేశాలతో కంచివాని చెరువులో ఉపాధి పనులు



చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మాకవరపాలెం, ఏప్రిల్ 12 : మండల కేంద్రం మాకవరపాలెంలోని కంచివాని చెరువులో ఎట్టకేలకు ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ చెరువులో ఉపాధి పనుల కోసం గత పదిహేను సంవత్సరాలుగా టీడీపీకి చెందిన చింతల శర్మతో పాటు ఆయకట్టు రైతులు పోరాటం చేశారు. అయితే ఇది చెరువు కాదని ఒక వర్గం, చెరువు అని టీడీపీ వర్గీయులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై వివిధ రూపాల్లో టీడీపీ నాయకులు పోరాటం చేశారు. అయితే చెరువులో నీరు ఆయకట్టుకు రాకుండా నీటికి అడ్డంకులు కల్పించడంతో గత పదిహేనేళ్లుగా వరి సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు కోర్టు ఆదేశాల మేరకు కంచివాని చెరువులో ఉపాధి పనులు ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు.

జాలంపల్లిలో వర్షం



జాలంపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 12 : భానుడి ప్రతాపంతో అల్లాడిపోతున్న జాలంపల్లి పరిసర గ్రామాల ప్రజలపై శుక్రవారం వరుణుడు కరుణ చూపాడు. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వాతావరణం మారిపోయింది. ఆకాశంలో మబ్బులు వేసి, మోస్తరు వర్షం కురిసింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు.

పాడి పశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

కె.కోటపాడు, ఏప్రిల్ 12 : ఉత్తరాంధ్ర అంతటా పాడి పశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని విశాఖ డెయిరీ జీఎం ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని చౌడువాడలో గల విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద చూడు నిలవని పాడి పశువులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విలువైన మందులను పలువురు పాడి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఏజీఎం డాక్టర్ పాండ్యరాజన్, డాక్టర్ హరినారాయణ, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కొమార వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటి ప్రచారం

చీడికాడ, ఏప్రిల్ 12 : మండలంలోని తురువోలు, పెద గోగాడ, అర్జునగిరి, చుక్కపల్లి గ్రామాల్లో మాడుగుల అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిని ఈర్లె అనూరాధ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కురచా జయమ్మ, నాయకులు గొల్లవిల్లి రాజబాబు, సర్పంచ్‌లు బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

గొలుగొండ, ఏప్రిల్ 12 : చిన్నయ్యపాలెం పంచాయతీ అనంతసాగరం శివారున శుక్రవారం ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊట ధంసంన చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి బెల్లం ఊటను ధ్వసం చేయడంతో పాటు సారా తయారీకి సంబంధించి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

జన్నవరం హైస్కూల్‌కు లయన్స్ క్లబ్ వితరణ

చోడవరం, ఏప్రిల్ 12 : జన్నవరం జెడ్పీ హైస్కూల్‌కు విశాఖ లయన్స్ క్లబ్ ప్రతినిధులు రూ.50వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు, 20వేల రూపాయల విలువ చేసే క్రీడాసామగ్రిని, సైకిళ్లను అందజేశారు. శుక్రవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దుర్గా ప్రసాద్, వెంకట రమణ, చంద్రశేఖర్, అశోక్ అగర్వాల్ తదితరులు హెచ్‌ఎం పద్మావతికి వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసం సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల సమస్యలపై స్పందించాలి'

రావికమతం, ఏప్రిల్ 12 : లక్షలా కుటుంబాలు రోడ్డున పడే మోటార్ చట్టాలను కేంద్ర, రాష్ట్ర రద్దు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కొత్తకోట శాంతి ఆటో యూనియన్ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోటార్ కార్మికులు ఇబ్బంది పడే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జీవోలను విడుదల చేయడం అన్యాయమన్నారు ఇన్సూరెన్స్, ఆర్‌టీఏ చలానాలు చెల్లిస్తున్న ఆటో కార్మికులపై ప్రభుత్వాలకు ఏమాత్రం కనికరించడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.బుల్లిబాబు, శేఖర్, నాగు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ఫార్మా ప్రమాదంపై ...

... 5వ పేజీ తరువాయి

ఆరోపిస్తున్నారు. ఆ ప్రమాదం తరువాత ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో నాలుగు ప్రమాదాలు జరగడం గమనార్హం. సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలడం వల్లే ప్రమాదం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనిని ప్రజా శాస్త్రవేత్తల బృందం తీవ్రంగా ఖండిస్తోంది. రసాయనాలను శుద్ధి చేసే సాహితీ ఫార్మాలో రియాక్టర్లు ఉండవని, రసాయనాలను వేడి చేయడానికి ఉపయోగించే రీబాయిలర్‌లో ప్రమాదం జరిగిందని పేర్కొంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. సాహితీ ఫార్మాలో అంతకు ముందు కూడా ఒకసారి ప్రమాదం జరిగిందని, అయినా ఆ సంస్థ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఎన్‌జీటీకి వివరించారు. ఈ ప్రమాదంపై అనకాపల్లి కలెక్టర్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక అందిందని, అయితే నిపుణులతో కూడిన కమిటీని కూడా నియమించారని, ఆ కమిటీ ఇంకా నివేదిక ఇవ్వకపోవడం దారుణమని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపించారు. తక్షణమే ఈ కేసులో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేందుకు జిల్లా అధికారులు సహకరించాలని కోరారు.

ఇప్పుడే గుర్తుకొచ్చెనా..

... 5వ పేజీ తరువాయి

హడావిడిగా కానిస్తున్నారు.

అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు పనులు

అనకాపల్లి నుంచి వయా మునగపాక అచ్యుతాపురం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు గత కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేపు మాపు అంటూ కాలం గడిపేశారు. ఈ రోడ్డు విస్తరణకు కనీసం భూ సేకరణ పనులు పూర్తి చేయలేకపోయారు. కాగా గత నెలలో ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆదరాబాదరాగా వీఎంఆర్‌డీఏ నిధులు రూ.6.5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. పాత రోడ్డు విస్తరణ జోలికి పోకుండా అడుగడుగునా గోతులతో వాహనదారులకు నరకం చూపిస్తున్న అనకాపల్లి వయా మునగపాక అచ్యుతాపురం సుమారు 13 కిలోమీటర్ల పాత రోడ్డుపైనే ఒక లేయర్ తారు వేసి రోడ్డు పనులు వేగంగా చేస్తున్నారు.

ఎన్నికల స్టంటేనా?

జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి బూడి ముత్యాలునాయుడు ఐదేళ్లుగా తన సొంత నియోజకవర్గమైన మాడుగులకే పరిమితమయ్యారని పార్టీ వర్గీయులే చెబుతుంటారు. రెండేళ్ల కిందట ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లాలో ఇతర నియోజకవర్గాల అభివృద్ధి గురించి ఏనాడు పట్టించుకోలేదు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగులను ఆనుకొని వున్న చోడవరం నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి గుర్తించి జనం గగ్గోలు పెడుతున్నా అటువైపు కన్నెత్తైనా చూడలేదు. కాగా రానున్న ఎన్నికల్లో బూడి ముత్యాలునాయుడు అనకాపల్లి లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నందునే ఓటర్లు ప్రశ్నిస్తారనే భయంతో హడావిడిగా ఆగిన రోడ్లు వేయిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.